క్లుప్తంగా

అన్ని వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ కృషి



కంకిపాడు: అన్ని వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ పాటుపడుతుందని, అండగా నిలుస్తుందని వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి వితరణతో ఈడుపుగల్లుకు చెందిన షేక్ సుబాన్‌వలీ ఇటీవల మృతి చెందటంతో బాధిత కుటుంబానికి రూ.10 వేలు, కంకిపాడుకు చెందిన పోలేపల్లి జాన్ ఇటీవల మృతి చెందటంతో బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, పార్టీ మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి మాట్లాడుతూ కార్యకర్తలకు ఏకష్టం వచ్చినా అండగా పార్టీ నిలుస్తుందన్నారు. మనోధైర్యంగా ముందుకు సాగాలని, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ మాజీ చైర్మన్ మేదంద్రావు కుటుంబరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తాళ్లూరి మరియబాబు, షేక్ అబ్దుల్లా, చోరగుడి మహేష్, కొల్లూరు దినేష్, షేక్‌కరీముల్లా, మాదు రాఘవేంద్రరావు, నకరికంటి శేఖర్ పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ

గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేని గూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం ఆత్కూరు పీహెచ్‌సీ ఆధ్వర్యాన దోమల నివారణకు మలాథియాన్ మందు పిచికారీ చేశారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వ్యాపించకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు కోరారు. మొత్తం 17 గదులలో స్ప్రే చేయించారు. వైద్య సిబ్బంది, ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి పాల్గొన్నారు.

ఏపీఎస్ విద్యార్థి చాప్టర్ ప్రారంభం



పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఆంటెన్నాస్ అండ్ ప్రోపగేషన్ సొసైటీ (ఏపీఎస్) విద్యార్థి చాప్టర్‌ను ప్రారంభించారు. కాలేజీలోని ఈఈఈ, ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 200 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని వివిధ సాంకేతిక అంశాలపై చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌ఏ రావూస్ కన్సల్‌టెంట్ సీఈవో డాక్టర్ సుధాకరరావు, భారతదేశంలో వివిధ జాతీయ యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్‌లు దేబతోష్‌గుహ, ప్రొఫెసర్ ధావల్‌పూజారా, ఏపీ- ఏఎస్ చాప్టర్ ప్రతినిధులు పి.సతీష్‌రామ చౌదరి, ధనేకుల కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, డీన్ డాక్టర్ ఆర్.సత్యప్రసాద్, డాక్టర్ రాజేష్ గోగినేని, డాక్టర్ ఎం.వంశీకృష్ణ, కోకిల కలపాల, పి.గురువుల నాయుడు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆద మరిస్తే.. ఆస్పత్రికే!



మానికొండ(గన్నవరం): మండలంలోని మానికొండ- గన్నవరం ఆర్అండ్‌బీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఏళ్ల తరబడి కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో రోడ్డుపై తారు పూర్తిగా కొట్టుకుపోయింది. రహదారిపై అడుగడుగునా భారీగా గుంతలు పడ్డాయి. పలుచోట్ల రోడ్డు కుంగిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రాత్రి వేళలో ఇప్పటికే అనేక మంది వాహనదారులు గుంతల్లో పడి గాయాల బారినపడినట్లు చెబుతున్నారు. పాలకులు స్పందించి అధ్వాన్న స్థితికి చేరుకున్న రోడ్డుకు కనీస మరమ్మతులైనా చేపట్టాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

చినుకు పడితే ప్రయాణం కష్టమే



గన్నవరం: స్థానిక రాయ్‌నగర్‌లో నిత్యం రద్దీగా ఉండే చర్చిరోడ్డు చినుకుపడితే చిత్తడిగా మారుతోంది. గతంలో నిర్మించిన బీటీ రోడ్డుపై తారు లేచిపోయి, పూర్తిగా రాళ్లు తేలడంతో భారీగా గుంతలు పడ్డాయి. దీంతో వర్షకాలంలో గుంతల్లో నీరు నిలిచి రోడ్డు చిత్తడిగా మారడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రాయ్‌నగర్, ఎస్సీ కాలనీ, మర్లపాలెం వెళ్లేందుకు ఈ రోడ్డే ప్రధాన మార్గం. అంతే కాకుండా ఈ రహదారిలోనే పలు ప్రైవేట్ పాఠశాలలు కూడా ఉన్నాయి. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ రహదారి అధ్వాన్నంగా తయారవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రోడ్డు పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ

- గందరగోళంగా డ్రెయినేజీ నిర్మాణ పనులు
- ఎన్‌హెచ్‌ఏఐ ప్రేక్షక పాత్ర
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు



డ్రెయినేజీపై ఏర్పాటు చేసిన తాత్కాలిక బాట



బందరు రోడ్డు పక్కన అస్తవ్యస్తంగా డ్రెయినేజీ తవ్వకాలు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పనితీరు నానాటికి దుర్భలంగా మారుతోంది. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి పక్కన ఒక వైపు డ్రెయినేజీలు నిర్మాణం చేసేందుకు ఆగమేఘాలపై మట్టి తవ్వకాలు చేపట్టారు. అయితే పనులు దశా దిశ లేకుండా అస్తవ్యస్తంగా మారటంతో వ్యాపారులతో పాటు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

వివరాల్లోకి వెళితే..

పోరంకి శివాలయం ప్రాంతం నుంచి పచ్చళ్ల కంపెనీ వరకు దాదాపు 750 మీటర్లకు పైగా బందరు రోడ్డుకు ఒక పక్క రూ.80 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఈ పనులు తలాతోక లేకుండా జరుగుతున్నాయి. జేసీబీలు, పొక్లెయినర్‌లు తీసుకు వచ్చి హడావుడిగా డ్రెయినేజీ నిర్మాణం కోసం మట్టి తవ్వకాలు చేశారు. తవ్విన మట్టిని ఎక్కడికి తరలించారో పాలకులకే తెలియాలి.

ప్రమాదకరంగా తవ్వకాలు..

ఇది ఇలా ఉంటే డ్రెయినేజీల కోసం తవ్విన గుంతలు అత్యంత ప్రమాదంగా ఉన్నాయి. దాదాపు ఆరడుగుల లోతులో ఉన్నాయి. తవ్విన డ్రెయినేజీ గుంతలకు ఆనుకునే దుకాణాలు ఉండటంతో వ్యాపారాలు, వినియోగదారులు దుకాణాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాలలోకి వెళ్లటానికి తాత్కాలికంగా చేసిన ఏర్పాట్లు ప్రమాదంగా ఉండటంతో ఆందోళన చెందుతున్నారు

నత్తనడకన పనులు

డ్రెయినేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గుంతలు తవ్వి వారం రోజులకు పైగా గడిచినా పనులు వేగంగా చేయటం లేదు. వర్షం పడటంతో తవ్విన మట్టితో ఆ ప్రాంతమంతా బురదమయంగా మారుతోంది. రాత్రి సమయాల్లో ఆరడుగుల గుంతల్లో ఎవరైనా పడితే ప్రమాదం జరిగి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. డ్రెయినేజీ నిర్మాణ పనులు కూడా అనుకూలంగా ఉన్న వారి ప్రాంతాల్లో వేగంగా చేస్తున్నారు. ఇతరుల ప్రాంతల్లో పనులే మొదలు పెట్టలేదు.

పనులకు అనుమతి ఉందా..?

కాగా విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారికి ఇరుపక్కల డ్రెయినేజీ నిర్మాణ పనులు ఎన్‌హెచ్ఐ అధికారుల పర్యవేక్షణలో జరగాల్సి ఉంది. గతంలో కానూరు నుంచి పోరంకి వరకు ఇరుపక్కల డ్రెయినేజీ పనులు ఎన్‌హెచ్ఐ అధికారులు పర్యవేక్షణలో ఎన్‌హెచ్‌ఏఐ పరిధిలోని కాంట్రాక్టర్ చేశారు. అయితే పోరంకి నుంచి గంగూరు వరకు డ్రెయినేజీ నిర్మాణ పనులు గ్రాంట్ లేక ఎన్‌హెచ్ఐ చేయలేదు. గతంలో రోడ్డు కోసం భూసేకరణ కూడా ఎన్‌హెచ్ఐ చేసింది.

150 అడుగుల వెడల్పుగా ఉన్న రోడ్డు పరిధి పూర్తిగా ఎన్‌హెచ్‌ఏఐ పరిధిలోనే ఉంది. వాస్తవానికి డ్రెయినేజీ పనులు ఎన్‌హెచ్ఐ అధికారులు మాత్రమే గ్రాండ్ చేయాలి. అయితే ప్రస్తుతం తాడిగడప మున్సిపాలిటీ సొంత నిర్ణయాలతో నిధులు ఖర్చు చేసి స్వీయ పర్యవేక్షణలో మున్సిపాలిటీ పరిధిలో ఉండే కాంట్రాక్టర్‌కు డ్రెయినేజీ పనులు అప్పగించింది. ఎన్‌హెచ్‌ఏఐ పరిధిలో ఉన్న పనులు తాడిగడప మున్సిపాలిటీ ఎలా చేపడుతుందనేది ప్రశ్నగా మారింది. డ్రెయినేజీ నిర్మాణ పనులు తాడిగడప మున్సిపాలిటీ చేయకూడదని నిపుణులు అంటున్నారు.

అంతా గందరగోళం..

తాడిగడప మున్సిపాలిటీ పనుల తీరు గందరగోళంగా మారింది. ఇంటి ప్లాన్‌లు, అక్రమ లేఅవుట్లు, అవినీతితో పాలన గందరగోళంగా ఉండగా తాజాగా డ్రెయినేజీల నిర్మాణం కొత్త వివాదం తెరపైకి వచ్చింది. మున్సిపాలిటీ పాలకులు ఏమి చేస్తున్నారో ప్రజలకు అర్థంకావటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో తీవ్రంగా ఉన్న సమస్యలు గాలికి వదిలి, ప్రాధాన్యం లేని పనులు హడావుడిగా చేయటంపై మున్సిపాలిటీ ప్రజలు ఆక్షేపిస్తున్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారి విచారణ

ఉయ్యూరు: అనధికార లే అవుట్‌లలో అక్రమ విద్యుత్ లైన్ల ఏర్పాటుపై విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం విచారణ చేపట్టింది. లోకాయుక్త ఆదేశాల మేరకు ఉయ్యూరులో విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం అధికారి జి.దాస్ శుక్రవారం విచారణ నిర్వహించారు. ఉయ్యూరుతో పాటు సీఆర్‌డీఏ, ముడా పరిధిలో అనధికార లే అవుట్‌లలో అక్రమ విద్యుత్ లైన్లు ఏర్పాటుచేసి ప్రభుత్వ ఆదాయానికి నష్టం చేస్తున్నారని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ రాష్ట్ర విద్యుత్ శాఖ ముఖ్యకార్యదర్శి విజయానంద్, రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా వేసిన లే అవుట్‌లలో ప్రభుత్వ శాఖలు మౌలిక వసతులు కల్పించటంతో ప్రజలు స్థలాలు కొనుగోలు చేసి మోసపోతున్నారని, రియల్ వ్యాపారులకు ఆదాయం సమకూరుస్తూ ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యుత్ శాఖ విద్యుత్ లైన్లను ఏర్పాటుచేసి ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వటంతో స్థలాలు కొనుగోలు చేసిన యజమానులు మోసపోతున్నారని చేసిన ఫిర్యాదుతో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, లోకాయుక్త ఆదేశాల మేరకు విజిలెన్స్ విభాగం అధికారి దాస్ విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారు శ్రీనివాసగౌడ్ నుంచి వివరాలను సేకరించారు. అనధికార లే అవుట్‌లు, సంబంధిత శాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా గౌడ్ కోరారు.



ఫిర్యాదుదారుడు శ్రీనివాసగౌడ్ నుంచి వివరాలు సేకరిస్తున్న విజిలెన్స్ అధికారి దాస్

అంగన్‌వాడీ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని ఆరో నంబరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం పిలుస్తుంది-సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో భాగంగా 10 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లలతో పలకల మీద అక్షరాలను రాయించారు. రోజూ చిన్నారులకు కోడిగుడ్లు, పాలు, మధ్యాహ్నం భోజనం తదితర ఏర్పాట్లు చేయనున్నట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు తెలియజేశారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పిస్తే మంచి ఆరోగ్యం, విద్య ఉంటుందన్నారు. అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

పెనమలూరు: యనమలకుదురులో శుక్రవారం చిన్నారులు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. యనమలకుదురు-5 కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం.కల్యాణి వర్మ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులకు చదువుతో పాటు ఆటపాటలు, పౌష్టికాహారం, వైద్యం కూడా అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి షెహనాజ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

రామవరప్పాడు : విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు పీఎస్ఆర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి చిన్నారి విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. స్వర్ణకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన పూర్వప్రాథమిక విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ఇంగ్లిష్, తెలుగు పద్యాలు, కథలు, సృజనాత్మక కృత్యాలతో విద్యా బోధన చేస్తున్నట్లు తెలిపారు. చిన్నారులకు మధ్యాహ్నం పౌష్టికాహారం అందజేస్తామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నున్నలో చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న కార్యకర్తలు



యనమలకుదురులో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లులు



రామవరప్పాడులో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న స్వర్ణకుమారి

మలేరియా నివారణే లక్ష్యం

డీఎంవో రామారావు

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాదలో శుక్రవారం జిల్లా మలేరియా నివారణ అధికారి బి.రామారావు పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కీటక జనిత వ్యాధుల నివారణకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. స్థానిక బాలికల వసతి గృహానికి వెళ్లి మలేరియా నిరోధకానికి తీసుకోవాల్సిన చర్యలు సిబ్బందికి వివరించారు. హాస్టల్‌లో గదులలో దోమల నివారణ మందు పంచికారీ చేయించారు. అన్ని గ్రామాల్లోనూ వైద్య సిబ్బంది మలేరియా నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ముస్తాబాదలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. తల్లిదండ్రులు, గ్రామస్తులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలన అందరి లక్ష్యం కావాలి

కంకిపాడు: మలేరియా నిర్మూలన అందరి లక్ష్యం కావాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి జీవీవీ శ్రీనివాసరావు సూచించారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. కోలవెన్ను గ్రామంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి జీవీవీ శ్రీనివాసరావు పర్యటించారు. ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని రికార్డులను తనిఖీ చేసి, అనంతరం మలేరియా నిర్మూలన అవగాహనా ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామ పంచాయతీల సహకారంతో దోమల నిర్మూలన చర్యలు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టీ.శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఈఓ కృష్ణారావు, సూపర్‌వైజర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ రాచమళ్ల శ్యాంప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రవికిరణ్, ఏఎన్ఎం పద్మావతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ముస్తాబాద హాస్టల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంవో రామారావు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ పోరంకిలో విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. దీని కారణంగా బీజేఆర్ నగర్, నిడమానూరు రోడ్డు, మహాలక్ష్మినగర్, వసంతనగర్, విష్ణుపురం కాలనీ, సాయినగర్, బందరురోడ్డు, లక్ష్మిపురం కాలనీ, గద్దె ఆర్టీసీ కాలనీ, రంగా బొమ్మ, పోరంకి సెంటర్, ప్రభునగర్, కరణంగారి బజార్, డొంకరోడ్డు, శ్రీనివాసానగర్, సీతాపురంకాలనీ, రామాపురంకాలనీ, సాలిపేట, పెనమలూరు సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

తాడిగడపలో..

తాడిగడపలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. దీని కారణంగా శ్రీనివాసానగర్‌కట్ట, పద్మజానగర్, తాడిగడప గ్రామంలో విద్యుత్ ఉండదని స్థానికులు సహకరించాలని ఈఈ కోరారు.

కానూరులో..

కానూరు విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కానూరు పెద్దబావి సెంటర్, గుమ్మడి తోట, యాదవుల బజార్, రంగా బొమ్మ సెంటర్, వృద్ధుల ఆశ్రమం రోడ్డు, కెనడీ పాఠశాల, రాజ్‌కమల్ భవనం ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

గన్నవరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటినెన్స్ వర్క్స్, విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో శనివారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ పి.హరిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గన్నవరం మొత్తం ఏరియాతో పాటు సుబ్బారావు నగర్, మర్లపాలెం, చిన్నఆవుటపల్లి, దుర్గాపురం, ఎయిర్‌పోర్ట్ సిటీ, బీబీ.గూడెం, గోపవరపుగూడెం స్టేట్ స్కూల్, చిక్కవరం ఇండస్ట్రీస్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గన్నవరం: ఉంగుటూరు మండలం పెద్దఆవుటపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు పెద్దఆవుటపల్లి, హైటెక్ ఫీడర్, ఏజీఎల్ ఫీడర్, ఇండస్ట్రియల్ ఫీడర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంత విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉయ్యూరు: విద్యుత్ మరమ్మతులు నిమిత్తం ఈనెల 14, 15 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ తెలిపారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 400 కేవీ, 220 కేవీ విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. ఈ కారణంగా ఉయ్యూరు, గండిగుంట, కాటూరు, ముదునూరు, నందమూరు, యాకమూరు, తోట్లవల్లూరు, వల్లూరుపాలెం, పెనమకూరు, దేవరపల్లి, పాములలంక విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

● నిర్లక్ష్యానికి నిదర్శనం



గుర్రపు డెక్క, వ్యర్థాలతో నిండిపోయిన బందరు కాలువ

తూర్పు కృష్ణాలో లక్ష ఎకరాలకు పైగా సాగు నీరు అందించే బందరు కాలువ పరిస్థితి దుర్భలంగా మారింది. రైతులు సార్వాకు సన్నద్ధం అవుతున్నా కూటమి ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉంది. యనమలకుదురు నుంచి కంకిపాడు లాకు వరకు బందరు కాలువ పూర్తిగా పూడుకు పోయి ఉంది. కాలువలో పూడిక తీత పనులు చేయక పోతే శివారు ప్రాంతాలకు సాగునీరు అందే పరిస్థితి లేదు. రైతుల సంక్షేమం గురించి ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న కూటమి నేతలు ఆచరణలో బందరు కాలువకు మరమ్మతులు చేయకుండా వదిలేశారు. ఇరిగేషన్ అధికారులూ పట్టించుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ తీరుపై రైతులు చాలా ఆందోళన చెందుతున్నారు. - పెనమలూరు

ముగిసిన పునీత ఆంతోని మహోత్సవాలు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి ఆర్‌సీఎం చర్చిలో గత పది రోజులుగా జరుగుతున్న పునీత ఆంతోని వారి మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. తొలుత విజయవాడ మేత్రాసనం పీఠాధిపతులు తెలగతోటి జోసఫ్ రాజారావు నేతృత్వంలో పలువురు విచారణ గురువులు దివ్య బలిపూజను సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు మాట్లాడుతూ.. క్రీస్తు పట్ల అమితమైన ప్రేమ, భక్తిభావం కలిగిన పునీత అంతోని అవిశ్రాంతంగా సువార్త సత్యాన్ని ప్రకటించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ పునీత ఆంతోనిని స్ఫూర్తిగా తీసుకుని దేవుడి పట్ల భక్తిశ్రద్ధలతో జీవించాలని తెలిపారు. యువత మంచి మార్గంలో నడుచుకోవాలని సూచించారు. అనంతరం బిషప్‌చే నూతనంగా బాలబాలికలు దివ్యసత్ప్రసాదం పొందారు. ఆటపాటలు, బైబిల్ పరీక్షలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం భక్తులకు ప్రేమపూర్వక విందు ఇచ్చారు. సాయంత్రం పునీత అంతోనివారి స్వరూపంతో తేరు ప్రదక్షిణ జరిపారు. కేసరపల్లి విచారణకర్తలు రెవ.ఫాదర్ నూతలపాటి కిషోర్, గన్నవరం విచారణ గురవులు ఫాదర్ పసల థామస్, పలువురు మేత్రాసనం గురువులు, కన్యా స్త్రీలు, పెద్దలు పాల్గొన్నారు.



తేరు ఊరేగింపులో భక్తులు, విచారణకర్త



దివ్యసత్ప్రసాదం పొందిన బాలబాలికలతో బిషప్

ఆక్రమణలపై చర్యలు ఏవి?



పెనమలూరు: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి షెడ్డు వేసినా అధికారులు స్పదించటం లేదు. గోసాల వైకుంఠపురంలో టీడీపీ నేతల అండదండలతో ఓ వ్యక్తి అత్యంత విలువైన నీటిపారుదల శాఖ స్థలంలో షెడ్డు వేశాడు. ఈ ఆక్రమణపై స్థానికులు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులకు గతంలో ఫిర్యాదు చేశారు. షెడ్డు తొలగిస్తామని అప్పట్లో హడావుడి చేశారు. ఆ తరువాత అధికారులు ముఖం చాటేశారు. కూటమి పాలనలో అధికారుల పని తీరుకు ఇది ఉదాహరణ అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

పెనమలూరు ఎస్ఐ బదిలీ

పెనమలూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పెనమలూరు సెక్టార్ ఎస్ఐగా పని చేస్తున్న లంకా రాజేష్ ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ఆయన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్నారు. ఎస్ఐ రాజేష్‌ను గన్నవరం ట్రాఫిక్ ఎస్ఐగా బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న బీఎస్‌డీఆర్ ప్రసాద్‌ను నియమించగా శుక్రవారం విధుల్లో చేరారు.

హత్య కేసే కారణమా.?

పెనమలూరులో జరిగిన హత్య కేసులో ముగ్గురు బీహార్ నిందితులు పరారీ అవటానికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు వచ్చాయి. వ్యక్తిపై దాడి జరగ్గా అతను విషమ పరిస్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇచ్చారు. నిందితులు బెయిల్ తీసుకున్న తరువాత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు మృతి చెందాడు. ఈ కేసులో ముగ్గురు బీహార్ యువకులను పోలీసులు అదుపులోకి తీసుకోవాలని యత్నించగా అప్పటికే పారిపోయారు. ఈ ఘటన వివాదానికి దారి తీసింది. ఈ కారణంగానే ఎస్ఐ బదిలీ అయ్యారని పోలీసు వర్గాలు చర్చించు కుంటున్నారు.

'ఉపాధి' కూలీల నిరసన

గన్నవరం రూరల్: ఉపాధి హామీ పథకం కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవటం పాలకుల అసమర్థతకు నిదర్శనమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కళ్లం వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం సూరంపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి కార్మికులతో కలిసి నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కనీసం కార్మికులకు వేతనాలు చెల్లించలేని దుస్థితిలో ప్రభుత్వాలు పాలన కొనసాగిస్తున్నాయని ఎద్దేవా చేశారు. తక్షణమే వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బెజవాడ తాతబ్బాయి, కై లే ఏసుదాసు, పులపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.